నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, గురువారం 17 అక్టోబర్ 2024 | MAHABUBABAD

హద్దులో ఉండాలి

ఎమ్మెల్యేలతో అంతరం రాకుండా చూసుకోవాలి

- మంత్రి సురేఖకు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ ఆదేశం
- పీసీసీ చీఫ్‌ను కలిసిన వరంగల్ ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు
- సురేఖ తీరుపై పీసీసీ చీఫ్‌కు వివరించిన ఎమ్మెల్యేలు

వరంగల్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'ఒకే పార్టీలో ఉంటూ ఘర్షణలు సరికాదు. మంత్రి హోదాలో ఉండి దానికి అనుగుణంగా వ్యవహరించాలి. సొంత పార్టీ కార్యకర్తల మధ్య దూరం పెరగకుండా జాగ్రత్తగా ఉండాలి. కార్యకర్తల మధ్య గొడవలు రాకుండా మనమే చూడాలి. స్థానిక ఎన్నికల ముందు గ్రూపులు ఉండడం పార్టీకి నష్టం చేస్తుంది. మంత్రిగా ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలి. ఇప్పటి నుంచి ఎవరితో అంతరం రాకుండా చూసుకోండి' అని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మంత్రి కొండా సురేఖను ఆదేశించినట్లు తెలిసింది. మంత్రి సురేఖ వైఖరితో వరంగల్ ఉమ్మడి జిల్లాలో జరిగిన పరిణామాలపై వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, ఎం యశస్వినీరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బుధవారం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వివరించారు. ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో కొండా సురేఖ జోక్యం వల్ల కాంగ్రెస్ పార్టీలో గ్రూపులు తయారవుతున్నాయని చెప్పారు. వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గంలోని గీసుగొండ పోలీసు స్టేషన్‌కు స్వయంగా మంత్రి సురేఖ వెళ్లడంపై పార్టీలో, ప్రజల్లో ప్రతికూల చర్చ జరుగుతున్నదని వివరించారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని అన్ని సెగ్మెంట్లలోనూ మంత్రి సురేఖ తీరుతో పార్టీకి ఇబ్బందులు ఉంటున్నాయని తెలిపారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ అక్కడి నుంచి మంత్రి సురేఖతో ఫోన్‌లో మాట్లాడారు. వ్యక్తిగత పనుల వల్ల హైదరాబాద్‌కు రాలేకపోయానని, వరంగల్‌లో ఉన్నానని మంత్రి సురేఖ చెప్పినట్లు తెలిసింది. మంత్రి సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమన్వయంతో ముందుకు సాగాలని పీసీసీ చీఫ్ సూచించారు. మంత్రి సురేఖ వైఖరితో ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో నెలకొంటున్న ఇబ్బందులను వివరించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు రెండురోజులుగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు ప్రయత్నించారు. అధికారిక కార్యక్రమాలతో బిజీగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయాన్ని పీసీసీ చీఫ్‌కు అప్పగించారు. మంగళవారం మెదక్, ఆదిలాబాద్ జిల్లాల కాంగ్రెస్ సమీక్షా సమావేశాలు ఉండడంతో పీసీసీ చీఫ్‌ను వీరు కలవలేకపోయారు. బుధవారం సమావేశమై ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ పరిణామాలను వివరించారు.

కరుణాపురం జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్టీలో మాకు ప్రాధాన్యం లేదా?

ఇందిరమ్మ కమిటీల్లో మాకు స్థానం కల్పించరా?

- నిన్నగాక మొన్నొచ్చిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన వర్గీయులకేమో అందలమా?
- కరుణాపురం జాతీయ రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తల రాస్తారోకో

ధర్మసాగర్, అక్టోబర్ 16 : 'పార్టీని నమ్ముకోవడమే మా పాపమా? కాంగ్రెస్ పటిష్టతకు కష్టపడుతుంటే కనీసం గుర్తింపునివ్వరా? ఇందిరమ్మ కమిటీల్లో మాకు స్థానం కల్పించరా? నిన్నగాక మొన్నొచ్చిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన వర్గీయులకేమో అందలమా?' అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు మండిపడ్డారు. ధర్మసాగర్ మండలం కరుణాపురం జాతీయ రహదారిపై మండల కో ఆర్డినేటర్ కొత్తపల్లి భిక్షపతి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పదేళ్ల నుంచి కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ కోసం పనిచేస్తున్నామన్నారు. కాగా, ఎమ్మెల్యే కడియం వర్గీయులు గ్రామాల్లో జరిగే కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాల సమాచారం తమకు చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ ఉన్నా ఎమ్మెల్యే వర్గీయులే ముందువరుసలో ఉంటూ తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. మండలంలోని ఎమ్మెల్యే వర్గీయులు ఓ గ్రామంలో కూర్చుని ఇందిరమ్మ కమిటీలు వేశారని, దీన్ని నిరసిస్తూ రాస్తారోకో చేశామని పేర్కొన్నారు. కమిటీల్లో ఎమ్మెల్యేకు అనుకూలమైన వ్యక్తుల పేర్లు చేర్చారని విమర్శించారు. దీనిని రద్దు చేయాలని, అందరికీ సమాచారం ఇచ్చిన తర్వాతే కమిటీలు వేయాలన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నియోజకవర్గ ఇన్‌చార్జి సింగాపురం ఇందిర తమను పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. కాగా, విషయం తెలుసుకున్న ఇందిర.. నాయకులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో చిల్పూర్ దేవస్థానం డైరెక్టర్ బొలెడ్ల వికాస్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు భైరపాక దివాకర్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు పెసరు వెంకటయ్య, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు జూమీలాల్, శ్రీనివాస్, శశికుమార్, కుర్సుపల్లి ప్రశాంత్, కనకం ప్రవీణ్ పాల్గొన్నారు.

అటానమస్ పొందిన జనగామ ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాల

ఏబీవీ కళాశాలకు అటానమస్

- ప్రకటించిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్
- వివరాలు వెల్లడించిన ప్రిన్సిపాల్ నర్సయ్య

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నర్సయ్య

జనగామ చౌరస్తా, అక్టోబర్ 16 : జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆంధ్ర భాషాభివర్ధిని (ఏబీవీ) డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా కల్పించింది. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ నర్సయ్య విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో కేవలం ఏబీవీ డిగ్రీ కళాశాలకు మాత్రమే అటానమస్ హోదా రావడం గర్వకారణమని, ఈ విద్యా సంవత్సరం నుంచి 2028-29 వరకు కొనసాగుతుందన్నారు. దీని వల్ల కళాశాలకు ప్రత్యేక పాలక మండలి ఏర్పడుతుందని, వారి ఆమోదంతోనే ప్రభుత్వ నిధులను ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయడం, మౌలిక వసతులను మెరుగుపర్చడం, కొత్త కోర్సులను ప్రవేశ పెట్టడం, ఫీజుల నిర్ణయం, నియంత్రణ, పరీక్షల నిర్వహణ, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం కళాశాలలో 487 మంది విద్యార్థులున్నారని, అటానమస్‌తో వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. త్వరలో బాలుర, బాలికల హాస్టల్స్ నిర్మించి నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని నర్సయ్య కోరారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బండి రాజు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో స్వగ్రామానికి కుటుంబం

వదిలిపెట్టిన భూమి సాగు

వ్యవసాయ పనులు చేయిస్తున్న ఎస్సై సతీశ్

వెంకటాపూర్, అక్టోబర్ 16: ఓ యువకుడి వేధింపులు తాళలేక ఊరిని విడిచి వెళ్లిన కుటుంబం పోలీసుల చొరవతో తిరిగి స్వగ్రామానికి చేరుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పెరుకలపల్లికి చెందిన గాజబోయిన సమ్మయ్య కుటుంబం తమకున్న 12 ఎకరాల భూమిలో సాగు చేసుకుంటూ జీవిస్తుండేది. గ్రామానికి చెందిన మాదం శివ ఇబ్బందులకు గురిచేయడంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు చేశారు. అయినా అతనిలో మార్పు రాకపోవడంతో నాలుగేళ్ల క్రితం గ్రామాన్ని విడిచి రేగొండ మండలంలోని పోచంపల్లికి వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఓ కేసు సందర్భంగా శివ వివరాలు ఆరా తీస్తున్న క్రమంలో ఎస్సై జక్కుల సతీశ్‌కు సమ్మయ్య విషయం తెలిసింది. వెంటనే వారిని గ్రామానికి పిలిపించి భరోసా కల్పించి వ్యవసాయ భూమిలో సాగు చేసుకోవడానికి సహకరించారు.

పోలీసు బెదిరింపులకు భయపడేది లేదు

పోలీసుల బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేసి అండగా ఉంటాను. జై తెలంగాణ.. జై బీఆర్ఎస్ అన్నందుకే దేశద్రోహులాగా పోలీసులు అత్యుత్సాహంతో బీఆర్ఎస్ కార్యకర్తలను చితకబాదడం బాధాకరమైన విషయం. వారికి న్యాయం జరిగే విధంగా ఎన్‌హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు చేశాం. పార్టీ పోరాటం చేయడం వల్లే వెంటనే ఎస్సై దుర్గాప్రసాద్‌ను సస్పెండ్ చేయడంతో పాటు ఘటనపై క్షేత్రస్థాయిలో శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. అయితే విచారణలో స్థానిక ఏసీపీ, సీఐ, ఎస్సైలు బాధితులను కేసును ఉపసంహరించుకోవాలని, కమిటీ ముందు నిజాలు చెప్పొద్దని, లేదంటే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని బెదిరింపులు గురిచేస్తున్నారు. విచారణలో కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్న దుర్గాప్రసాద్‌ను కూర్చోబెట్టి బాధితులను విచారించడం సరికాదు.

– చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

నాడు చితకబాది.. నేడు బెదిరించి !

కొట్టిన ఎస్సై ముందే బాధితుల విచారణ

- విచారణ కమిటీ ముందే వార్నింగ్ ఇచ్చిన ఎస్సై దుర్గాప్రసాద్
- నిజాలు చెప్పొద్దు.. కేసును ఉపసంహరించుకోవాలి
- లేదంటే పీడీ యాక్టు పెడతాం.. రౌడీ షీట్లు తెరుస్తాం
- 'అగ్రంపహాడ్ జాతర బాధితుల'కు పోలీసుల బెదిరింపులు

పరకాల, అక్టోబర్ 16 : ఉన్నతాధికారి విచారణలో నిజాలు చెబితే రౌడీషీట్లు తెరుస్తామని, పీడీ యాక్టు కేసులు పెడుతామని, కేసును ఉపసంహరించుకోవాలని అగ్రంపహాడ్ జాతర బాధితులను పోలీసులు బెదిరింపులకు గురిచేస్తున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ఫిబ్రవరి నెలలో హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ జాతరలో పోలీసులు అత్యుత్సాహంతో 12మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను చితకబాదడంతో తీవ్రంగా గాయపడ్డారు. అప్పట్లో ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కాగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసనకు స్పందించిన సీపీ.. ఆత్మకూరు ఎస్సై ప్రసాద్‌ను సస్పెండ్ చేసి ఘటనలో ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ సంతోష్‌కుమార్, ఆత్మకూరు, దామెర ఎస్సైలు ప్రసాద్, అశోక్ పాత్రపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఇటీవల మామునూరు ఏసీపీ తిరుపతి, భూపాలపల్లి అదనపు ఎస్పీ బోనాల కిషన్‌ను విచారణ అధికారులుగా నియమించారు. కాగా ఈ ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ జరుగనున్న నేపథ్యంలో వారం రోజులుగా బాధితులకు పోలీసుల నుంచి బెదిరింపులు వస్తున్నాయి. ఇటీవల బాధిత బీఆర్ఎస్ నాయకులకు పోలీసులు ఫోన్ చేసి 'మీతో మాట్లాడే పని ఉంది.. పోలీస్‌స్టేషన్‌కు రావాలి' అని హుకుం జారీచేసినట్లు తెలిసింది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సదరు నాయకులకు అగ్రంపాడ్ ఘటనలో నిజాలను విచారణ అధికారుల వద్ద చెప్పొద్దని, కేసు ఉపసంహరించుకోవాలని బెదిరించినట్లు సమాచారం. 'మీరు ఈ మండలంలోనే ఉంటారు. నిజాలు చెప్పినట్లయితే ఎప్పటికైనా మీపై పీడీ యాక్టులు, రౌడీషీట్లు నమోదు చేస్తాం' అంటూ హెచ్చరించినట్లు సదరు బాధిత బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్షేత్రస్థాయిలో చేపట్టని విచారణ

బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా చితబాదిన కేసులో పోలీసులు విచారణను క్షేత్ర స్థాయిలో చెపట్టలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్సీ నుంచి పోలీసులకు నోటీసులు రాగా విచారణ అధికారులుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్, మామునూరు ఏసీపీలు ఉన్నారు. కాగా, విచారణలో భాగంగా బాధితులు మంగళవారం భూపాలపల్లి జిల్లాకు, బుధవారం మామునూరు ఏసీపీ కార్యాలయానికి హాజరయ్యారు. విచారణలో భాగంగా కమిటీతో ఎలాంటి సంబంధం లేని, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్సై దుర్గా ప్రసాద్‌ను కూర్చోబెట్టి ఆయన ముందే బాధితులను విచారించినట్లు సమాచారం. బాధితులు నిజాలు చెప్తున్న క్రమంలో సదరు ఎస్సై కమిటీ సభ్యుల ముందే కనుచూపుతోనే బెదిరింపులకు గురిచేసినట్లు బాధితులు ఆరోపించారు.

పోలీసులు చితకబాదడంతో గాయపడిన బీఆర్ఎస్ నాయకుడు (ఫైల్)

విత్తనం నాసిరకం.. కోయలేక సతమతం..

దీర్ఘకాలికమని సాగు చేస్తే 70 రోజులకే చేతికొచ్చిన వరి

- కోతకొచ్చినా రెండు నెలలు ఆగాల్సిన పరిస్థితి
- మానుకోట జిల్లాలో నష్టపోయిన ఏడుగురు రైతులు
- గుండ్రాతిమడుగు సొసైటీ ఎదుట అన్నదాతల ఆందోళన



రైతు మైసయ్య వద్దు తీసుకున్న రశీదు

గుండ్రాతిమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట వరి కంకులతో ఆందోళన చేస్తున్న రైతులు

కురవి, అక్టోబర్ 16 : రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు రైతుల పరిస్థితి. వానకాలంలో బాడువ (బురదగా ఉండేవి) పొలాల్లో ఎక్కువ రోజులకు పంట చేతికొచ్చే దొడ్డు రకం వరి పంటను అన్నదాతలు సాగుచేస్తారు. 150 రోజుల వ్యవధిలో పంట వస్తే భూమి గట్టి పడుతుందని వీటిని సాగు చేస్తారు. దీనికి తోడు అప్పటికే చుట్టూ ఉన్న స్వల్ప కాలిక వరి కోతలు పూర్తవ్వడం వల్ల బాడువ పొలాల్లోని పంటను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంటికి తరలించుకుంటారు. ఇందులో భాగంగానే ఈ వానకాలంలో సైతం దీర్ఘకాలిక దొడ్డు రకం వరి విత్తనమైన 1001 కావాలని గుండ్రాతిమడు గు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)కు స్థానిక రైతులు వెళ్లారు. అయితే ఆ విత్తనాలు లేకపోవడంతో జేజీఎల్24423 విత్తనాలను ఇవ్వడంతో జూలైలో సాగు చేశారు. తీరా నారు పోసిన సమయం నుంచి చూస్తే కేవలం 70 రోజుల్లోనే పంట ఏపుగా పెరిగి కంకులు పోసింది. పైగా పూర్తి స్థాయిలో కంకి పోయకపోవడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉండడంతో ఈ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంట కోయాలంటే చుట్టూ ఉన్న పొలాల్లో నుంచి వెళ్లడం సాధ్యం కాదని, మరో రెండు నెలలు ఆగాల్సి ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అప్పటి వరకు పంట మొత్తం నేలపాలవుతుందని కన్నీరు మున్నీరవుతున్నారు. చేతికొచ్చిన పంటను కోసి ఇంటికెట్లా తీసుకొచ్చేదంటూ ఆందోళన బాట పట్టారు. బుధవారం వరి కంకులను పట్టుకొని గుండ్రాతిమడుగు పీఏసీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

గుండ్రాతిమడుగు రైతులు ఫిర్యాదు చేయడంతో పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించాం. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం. వారి ఆదేశాల మేరకు రైతులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తాం.

– నర్సింహారావు, ఏవో, కురవి

70 రోజులకే ఏపుగా పెరిగి కోతకొచ్చిన వరి

దీర్ఘకాలిక పంట కావాలన్నాం..

నాకు గుండ్రాతిమడుగులో ఐదెకరాల బాడువ పొలం ఉంది. సొసైటీకి వెళ్లి 1001 రకం వరి విత్తనాలు కావాలని అడిగా. వారిచ్చిన విత్తనాలను సాగు చేస్తే 150 రోజులకు వచ్చే పంట కేవలం 70 రోజుల వ్యవధిలోనే చేతికి వచ్చింది. వెంటనే ఈ రకం పంట సాగుచేసిన రైతులం భయపడి వ్యవసాయాధికారిని కలిశాం. వారు వచ్చి పంటను చూశారు. గట్టిగా అడిగితే మేమేం చేయలేం... ఎవరి వద్ద విత్తనం కొన్నారో అక్కడే అడగండి అంటున్నారు. బాడువ పొలం భూమి దిగుబాటు ఎక్కువగా ఉంటుంది. అందుకే ఏటా దొడ్డు రకం వేస్తాం. చుట్టూ ఉన్న పొలాలు మరో రెండు నెలలు దాటితే కాని కోయరు. ఇప్పుడు చేతికి వచ్చిన పంట పూర్తిగా నష్టపోవాల్సిందే. ఇప్పటివరకు సాగుకోసం సుమారు రూ. 1.50 లక్షల వరకు ఖర్చయ్యింది.

– కుంభం మైసయ్య, రైతు, గుండ్రాతిమడుగు

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

- లేకపోతే నిరసన ఉధృతం చేస్తాం
- టీపీడీఎంఏ డిమాండ్
- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఏకశిలా పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొన్న టీపీడీఎంఏ సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ప్రైవేట్ అధ్యాపకులు

హనుమకొండ, అక్టోబర్ 16 : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మూడు రోజులుగా కళాశాలల నిరవధిక బంద్‌లో పాల్గొంటూ బాలసముద్రంలోని ఏకశిల పార్కు ఎదుట శాంతి దీక్ష చేపట్టారు. టీపీడీఎంఏ పిలుపు మేరకు బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సుమారు 70 కళాశాలల యాజమాన్యాలు, సిబ్బందితో కలిసి ఏకశిల పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు సుమారు వెయ్యి మందితో శాంతియుతంగా భారీ ర్యాలీ తీసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీధర్‌రావు, రవీంద్రనాథ్, ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఫీ రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాలలు నిర్వహించలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఫీ రీయింబర్స్‌మెంట్‌పై సర్కారు స్పందించడంతో పాటు ఫీజు బకాయిలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యేలు, మంత్రులు, కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నవంబర్‌లో విడుదల చేసిన టోకెన్ నంబర్లకు సంబంధించిన రూ. 600కోట్లను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. లేకపోతే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ వేణుమాధవ్, హనుమకొండ జిల్లా కో ఆర్డినేటర్ గోలి వెంకట్ పాల్గొన్నారు.

విడిపోని బంధానికి 22 ఏళ్లు

- సొంతూరు బీరిశెట్టిగూడేనికి అవిభక్త కవలలు వీణ-వాణి
- కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో జన్మదిన వేడుకలు

కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న వీణ-వాణి

దంతాలపల్లి, అక్టోబర్ 16 : విడిపోని బంధానికి 22 ఏళ్లు నిండాయి. అవిభక్త కవలలు వీణ-వాణి తమ జన్మదిన వేడుకలను బుధవారం తమ సొంతూరు మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెంలో జరుపుకున్నారు. వారి తల్లిదండ్రులు మారగాని మురళి, నాగలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులు, పలువురు గ్రామస్తుల సమక్షంలో కేక్ కట్ చేశారు. వీణ-వాణి 2003 అక్టోబర్ 16న సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జన్మించగా, పుట్టుకతోనే తలలు అతుక్కొని ఉన్నాయి. వీరిని శస్త్ర చికిత్స కోసం వివిధ రాష్ట్రాలు, దేశాలు తిప్పినప్పటికీ ఫలితం లేదు. ప్రస్తుతం వీరు హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ మైత్రివనంలోని చిల్డ్రన్స్ హోంలో ఉంటూ డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నారు. వీరు పుట్టిన తర్వాత రెండోసారి సొంతూరుకు రావడంతో అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆశీర్వదించారు. ఇలా అందరి సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని వీణ-వాణి తెలిపారు. జిల్లా చైల్డ్ హోమ్ కమిటీ సభ్యులు అశోక్, వీరన్న, మరిపెడ సీడీపీవో ఎల్లమ్మ, తహసీల్దార్ చంద్రరాజేశ్వర్, ఎంపీవో అఫ్సర్‌పాషా, ఆర్ఐ నజీముద్దీన్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, వీణ-వాణి పెద్దవాళ్లు అవుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని, తమ పిల్లలతో కలిసి ఉండేలా ప్రభుత్వం తమకు ఉపాధి కల్పించాలని వీణ-వాణి తల్లిదండ్రులు మురళి, నాగలక్ష్మి కోరారు.